
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
9
ఆదివారం 30 మార్చి 2025





ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

వేడుకగా.. ఆవిర్భావ దినోత్సవం

- ఉత్సాహంగా తమ్ముళ్ల కార్యక్రమాలు
- వాడవాడలా పార్టీ జెండాల ఆవిష్కరణలు
- ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు
- జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా తమ్ముళ్లు వేడుకగా జరుపుకున్నారు. పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను జిల్లా అంతటా నేతలు, కార్యకర్తలు కోలాహలంగా జరుపుకున్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో, పట్టణాల్లోని వార్డులతో పాటు అన్ని గ్రామాల్లోనూ పసుపు పండుగను టీడీపీ శ్రేణులు సంబరంలా జరుపుకున్నాయి. వాడవాడలా టీడీపీ జెండాలు రెపరెపలాడాయి. పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాలు, చిత్రపటాలకు నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల్లో అన్నదానం, కేక్ కటింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 43 ఏళ్ల ప్రస్థానంలో పేదలకు టీడీపీ నేతృత్వంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిగాయని నేతలు గుర్తు చేసుకున్నారు.

టీడీపీ.. పేదల గుండెచప్పుడు

పేద, బడుగు బలహీన వర్గాల గుండెచప్పుడులో నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం.. ఎన్నో రాజకీయ విప్లవాలు సృష్టించిందన్నారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతిని ఎన్టీఆర్ ప్రపంచానికి చాటిచెప్పారన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, పక్కన డాక్టర్ పెమ్మసాని, నరేంద్ర , ఆలపాటి, మాధవి తదితరులు.

తెలుగువారు ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లేలా కృషి చేసిన విజనరీ నాయకుడు చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలో పేదలు, కార్యకర్తల సంక్షేమం కోసమే ఆవిర్భవించిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ అనేకమంది సామాన్యులను గొప్ప నాయకులుగా తీర్చిదిద్దిన పార్టీ టీడీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్, గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, జోన్ 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, నాయకులు గుంటుపల్లి శేషగిరిరావు, చిట్టాబత్తిన శ్రీనివాసరావు(చిట్టిబాబు), మద్దిరాల ఇమ్మానుయేల్, కసుకుర్తి హనుమంతరావు, వజ్రాణం హరిబాబు, నిమ్మల శేషయ్య, కంచర్ల శివరామయ్య, అడకా శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, షేక్ మీరావలి, దామచర్ల శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, ఈరంటి వరప్రసాద్‌బాబు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, కొత్తూరి వెంకట్, బొబ్బిలి రామారావు, ఘంటసాల సోమశేఖర్, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, చుక్కపల్లి రమేష్, షేక్ జానీబేగం, ఇత్తడి రత్నకుమారి, కూనంనేని వెంకటరమణ, లామ్ నవమి, జెట్టి రేణుక, అడపా బాబు, తిరువళ్లూరి పద్మావతి పాల్గొన్నారు.

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి భారీ కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగే ఆవిర్భావ వేడుకలకు 50 బస్సులు, 100 కార్లు, 100 బైకులు, 100 ఆటోలతో భారీ ర్యాలీగా మాధవి తరలివెళ్లారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, బైకులతో మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25
(ఆదివారం సాయంత్రం)



పీ-4 పండుగకు పేదలే అతిథులు

- వెలగపూడిలో నేడు కార్యక్రమం.. భారీగా ఏర్పాట్లు
- ప్రభుత్వ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి అవకాశం
- ఉగాది రోజున చారిత్రాత్మక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం

తుళ్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో అమలు చేయనున్న పీ-4 కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఆదివారం ప్రభుత్వ ఉగాది సంబరాల్లో భాగంగా రాజధానిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో భారీగా ఏర్పాట్లు చేశారు. పేదలే అతిథులుగా ఈ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేందుకు అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పీ-4లో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే క్యూఆర్‌కోడ్ ద్వారా పేదలు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. రాజధాని అమరావతి వేదికగా ఉగాది పర్వదినం నాడు చారిత్రాత్మకంగా పీ-4 కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. పేదల అభ్యున్నతికి ప్రజలు, దాతలు, ప్రభుత్వ సహకారంతో పీ-4 కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. వెలగపూడిలోని సచివాలయం వెనుక ఆదివారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనున్నది. 13 జిల్లాల నుంచి 12 వేల మంది సభకు హాజరు కానుండగా అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఇక జిల్లాల వారీగా ఈ కార్యక్రమానికి వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ప్రత్యేకంగా అధికారులు బాధ్యత తీసుకున్నారు. సభికులు కూర్చునేందుకు జర్మన్ టెంట్లు ఏర్పాటు చేశారు. వీవీఐపీలు, వీఐపీలకు ప్రత్యేకంగా మరో టెంటు ఏర్పాటు చేశారు. గ్యాలరీలను ఏర్పాటు చేసి కుర్చీలను సమకూర్చారు. సభకు దక్షిణ భాగంలో భోజన వసతికి భారీ టెంటు వేశారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సెలవులైనా పన్నులు చెల్లించొచ్చు

- నేడు రేపు జీఎంసీ క్యాష్ కౌంటర్లు ఓపెన్
- పన్నుపై వడ్డీకి 50 శాతం రాయితీకి రెండు రోజులే గడువు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించడానికి ఈ నెలాఖరు వరకే(2 రోజులే) గడువు ఉంది. ఆది, సోమవారాల్లో ఉగాది, రంజాన్ పండుగ సెలవులు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు పడకుండా ఆది, సోమవారాల్లో కూడా జీఎంసీకి సంబంధించిన క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సెలవు రోజులైనా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయన్నారు. శనివారం ఒక్కరోజే రూ.5 కోట్లు పన్ను వసూలైంది. ఆస్తి పన్ను వడ్డీపై ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని యజమానులు వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. ప్రజలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు కూడా 50 శాతం రాయితీతో పన్ను చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లలో పన్ను చెల్లించి, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి, ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్ల సిబ్బందికి కూడా ఈ రెండు రోజులు సెలవులు రద్దు చేశామన్నారు.

పనిచేయకపోతే తొలగించండి

- అధికారులపై కౌన్సిలర్లు గరంగరం
- తెనాలి కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆగ్రహం

తెనాలి, మారీసుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో పనిచేయని అధికారులను తొలగించాలని, చేసిన పనులకు అధికారులు వెంటనే బిల్లులు చెల్లించాలంటూ అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. తెనాలి కౌన్సిల్ సాధారణ, ప్రత్యేక సమావేశం శనివారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజారు వద్ద తాత్కాలిక షాపుల కోసం రూ.32 లక్షలు ఎందుకని టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, వైసీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి ప్రశ్నించారు. వెంటనే పనిని రద్దు చేయాలన్నారు. తన వార్డులో జరిగే అభివృద్ధి పనులను తమకు సమాచారం ఇవ్వకుండానే చేస్తున్నారని 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల సమాధానమిస్తూ ఎన్నికల కోడ్ కారణంగా కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వలేదని మరోసారి పొరపాటు జరగకుండా చూస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినా తమకు సమాచారం లేదని టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి అన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతుందని, అభివృద్ధి పనులకు బిల్లులు రూపొందించలేకపోతున్నారని పసుపులేటి త్రిమూర్తి, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. కనీసం కంప్యూటర్‌లో బిల్లులు చేసే ఉద్యోగి కూడా లేకపోవడం విచారకరమన్నారు. అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులను నిబంధనలకనుగుణంగా సకాలంలో పెట్టి ఆమోదిస్తామని ఇన్‌చార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ కఠారి రత్నకుమారి పూలే కాలనీలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరగా వచ్చే నెలలో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తామని కమిషనర్ శేషన్న చెప్పారు. కౌన్సిలర్ బోయపాటి అరుణ డొంక రోడ్డులో మంచినీటి సమస్య గత నాలుగేళ్లుగా ఉందని పరిష్కరించాలని కోరారు. కౌన్సిలర్ మానసారెడ్డి మాట్లాడుతూ అమరావతి ప్లాట్స్‌లోని అన్ని రోడ్లలో ప్యాచ్‌వర్క్‌లు చేయాలని కోరారు.





కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిల్ సభ్యులకు సమాధానమిస్తున్న కమిషనర్ శేషన్న



అధికారులను నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, యుగంధర్ తదితరులు

అమరావతిలో.. త్రిభువన్ సహకారి వర్సిటీ

- దేశంలో రెండో సహకార వర్సిటీగా గుర్తింపు
- పార్లమెంటులో చర్చ.. రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన అవకాశాల గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలిస్తోంది. రాజధాని అమరావతి అన్ని రంగాల్లో ప్రముఖంగా ఉండాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే నవ నగరాల థీమ్‌తో రాజధాని నిర్మాణానికి పూనుకున్నారు. దేశంలో రాజధాని నగరాలు కొన్ని రంగాల వరకే ప్రసిద్ధి చెందాయి. ఉదాహరణకు హైదరాబాద్ ఐటీ, మెడికల్ రంగంలో ప్రాచుర్యం పొందింది. కానీ అమరావతి అన్ని రకాల రంగాలకు రోల్‌మోడల్‌గా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం. ఈ క్రమంలో విద్యారంగానికి పెట్టని కోటగా ఉండాలని, అందుకు దేశంలో పేరెన్నికగన్న ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు మెరుగైన వసతులతో అమరావతిలో కొలువుదీరాలనే లక్ష్యంతోనే నాలెడ్జి సిటీకి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారు. ఈ సిటీకి రాజధానిలో 8578 ఎకరాలను కేటాయించారు. ఇందులో ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలన్నీ ఏర్పాటయ్యాయి. వీటిని మరింత విస్తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో సరికొత్తగా ఆవిర్భవించిన త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయాన్ని కూడా అమరావతిలో ఏర్పాటు చేసి దక్షిణ భారతదేశ సహకార రంగానికి కొత్త ఊపును తీసుకురావాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తుంది.

వర్సిటీకి ఇటీవలే లోక్‌సభలో ఆమోదం..

త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం బిల్లును ఈ నెల 26నే లోక్‌సభలో ఆమోదించారు. గుజరాత్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్(ఐఆర్ఎంఏ)లో ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించేందుకు అనుమతిస్తూ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం-1860 కింద నమోదుచేశారు. దేశంలో సహకార ఉద్యమానికి మార్గదర్శకుడు అమూల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన త్రిభువన్ కాశీభాయ్ పటేల్ గౌరవార్థం ఈ వర్సిటీకి ఆయన పేర నామకరణం చేశారు. ఈ నూతన వర్సిటీ కింద అన్నీ రాష్ట్రాలలోని సహకార శిక్షణా సంస్థలు పాఠశాలలు లేదా కళాశాలలుగా నమోదవుతాయి. ఇప్పటివరకు సహకార రంగానికి సంబంధించి వేలాది సహకార విద్యా శిక్షణా సంస్థలు ఉన్నా వాటిలో దేనికీ నిర్దిష్టమైన కోర్సులేవీ లేవు. ఆ సమస్యను ఈ వర్సిటీ పరిష్కరిస్తుంది. వాస్తవానికి దేశంలో సహకార రంగం అభివృద్ధి, విస్తరణ అనివార్యమైన మానవ వనరుల అవసరాన్ని తీర్చడానికి ఈ కొత్త వర్సిటీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన వర్సిటీని ఒక్కదానినే ఏర్పాటు చేసేదానికన్నా రెండోది ఏర్పాటు చేయడం సముచితమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బిల్లుపై చర్చలో ప్రస్తావించారు. ఆ రెండో కేంద్రాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తే దక్షిణ భారతదేశ సహకార రంగానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అమరావతిలో నాలెడ్జిసిటీ పేరిట ప్రఖ్యాత వర్సిటీలన్నీ కొలువు దీరుతున్న నేపథ్యంలో దక్షిణ భారతదేశంలో సహకార వర్సిటీ ఏర్పాటుకు కూడా అదే తగిన కేంద్రమని వివరించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి తగు కార్యాచరణ ప్రణాళికతో మళ్లీ కేంద్ర సహకార మంత్రిత్వశాఖను సంప్రదిస్తామని చెప్పారు. లోక్‌సభలో తాజాగా జరిగిన ఈచర్చ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం కూడా ఎంపీల సూచనలను పరిగణనలోకి తీసుకుని సహకార వర్సిటీ ఏర్పాటు గురించి యోచిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతానికి దేశంలో ఎనిమిది లక్షల సహకార సంఘాలు ఉండగా రాష్ట్రంలో వాటి సంఖ్య 17,884గా ఉంది.




త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం



ఎండ మండే అవకాశం

- హెచ్చరికలు జారీ చేసిన ఐఎండీ
- తాడేపల్లి, తుళ్లూరుల్లో నేడు 40 డిగ్రీలకుపైనే



గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే 48 గంటల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, తుళ్లూరు, అమరావతితో పాటు మరికొన్ని మండలాల్లో ఎండ మండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. తాడేపల్లిలో శనివారం 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం ఇది 40.4 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. తుళ్లూరులో శనివారం 39.2 డిగ్రీలు రికార్డు కాగా, ఆదివారం 40.6 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉన్నది. అమరావతిలో శనివారం 40.9 డిగ్రీలు రికార్డు కాగా ఆదివారం 40.7 డిగ్రీలు నమోదు కావొచ్చు. ఆదివారం బెల్లంకొండలో 40.6, దాచేపల్లిలో 40.9, గురజాలలో 40.7, కారంపూడిలో 40.2, క్రోసూరులో 40.5, మాచవరంలో 40.7, మాచర్లలో 40.1 పెదకూరపాడులో 40.5, పిడుగురాళ్లలో 40.4, రాజుపాలెంలో 40.1, రెంటచింతలలో 40.6, సత్తెనపల్లిలో 40.2 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. అలానే కొన్ని మండలాల్లో వడగాడ్పులు కూడా వీచే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఓవీ రమణకు కళారత్న పురస్కారం



గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ (ఓవీ రమణ)ను రాష్ట్ర ప్రభుత్వం కళారత్న పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది వేడుకల్లో ఆయన సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రజాసేవ, వైద్య సేవ, సామాజిక సేవ చేసిన ఆయనకు ప్రభుత్వంతోపాటు అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసించాయి. కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది లక్షల మందికి ఆయన ఉచితంగా హోమియో మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ కళరత్న అవార్డుకి ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కళారత్న, ఉగాది పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులు

ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కళారత్న, ఉగాది పురస్కారాలకు నగరానికి చెందిన ప్రముఖులు ఎంపికయ్యారు. కళారత్న పురస్కారాలకు ఎంపికయిన వారిలో డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం (నృత్యం), సోమంచి విజయ్ కుమార్ (పెయింటింగ్), కావూరు సత్యనారాయణ (కళలు), డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ (మెడిసిన్, సోషల్ సర్వీస్), చిట్టిపోతు మస్తానయ్య (సోషల్ సర్వీస్), చిట్టినేని లక్ష్మీనారాయణ (కళలు), పొత్తూరి రంగారావు (సాంస్కృతిక సేవలు) వున్నారు. అలాగే ఉగాది పురస్కారాలకు ఎంపికయిన వారిలో డాక్టర్ ఐ. లావణ్య, రాజా హుస్సేన్, రొక్కం కామేశ్వరరావు (అధ్యాపకులు) నల్లక శ్రీనివాసరావు (కళలు), డాక్టర్ గోళ్ళ రామకృష్ణ (అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ కాలేజ్), డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మురికిపూడి దేవపాల్ (సామాజికసేవలు) వున్నారు.

డాక్టర్ బొర్రా గోవర్ధన్‌కు కళారత్న అవార్డు



నగరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పేదకుటుంబంలో జన్మించి పట్టుదలతో అంచలంచెలుగా ఎదిగి సాహితీలోకంలో తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్న బౌద్ధరచయిత బొర్రా గోవర్ధన్‌కు ఉగాది పురస్కారాల్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రప్రభుత్వం అందించే కళారత్న అవార్డు లభించింది. ఆదివారం విజయవాడలోని తుమ్మ లపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది వేడుకల్లో ఆయన సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా ఈ అవార్డు అందుకోనున్నారు. మండల కేంద్రమైన నగరం వెనుకబడిన ప్రాంతంగా గుర్తించిన బొర్రా గోవర్ధన్‌కు అభివృద్ధి చెయ్యాలనే సంకల్పంతో శాంతినికేతన్ విద్యాసంస్థను స్థాపించి తన 43 బౌద్ధ రచనలతో పాటు సైన్స్, గణితం, వ్యవసా యం, జీవితచరిత్రలు, సామూహిక రచనలు లాంటివి 112చేశారు. 2015లో ప్ర పంచశాంతికి దోహదపడే బౌద్ధరచనలు, ఐక్యరాజ్యసమితి అనుబంధసంస్థయైన అకాడమిఆఫ్‌యూనివర్సల్ గ్లోబల్ పీఎస్‌వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు.

నల్లపాడు చెరువును అభివృద్ధి చేస్తాం..

● ఇది మంచి ప్రభుత్వమని నిరూపిస్తాం.. ● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

నల్లపాడు(మేడికొండూరు), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, కార్పొరేటర్ల కోరిక మేరకు నల్లపాడు చెరువును అభివృద్ధి చేస్తామని, ఇది మంచి ప్రభుత్వమని నిరూపిస్తామని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ చెప్పారు. నల్లపాడు చెరువును స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు నగరపరిధిలోని 27వ డివిజన్‌లో 93 ఎకరాల చెరువును అభివృద్ధి చేయాలని, నీటి నిల్వతో పాటు ప్లేగ్రౌండ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నందున వారికిచ్చిన హామీ మేరకు చెరువును అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. 93 ఎకరాల చెరువులో 30ఏళ్లకు పైగా పూడిక తీయకపోవడం వల్ల చెరువు పూడుకుపోయిందని అన్నారు. మరి కొంత భాగం ఆక్రమణలకు గురయిందని, వెంచర్లు కూడా వెలిశాయని వివరించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చే మురుగు కూడా చెరువులో కలుస్తుందన్నారు. వీటిన్నింటిపై చర్యలు తీసుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం నుంచి 10 లేదా 12కోట్ల నిధులతో చెరువు పనులు చేయించాల్సి ఉందన్నారు. తరువాత ప్రాజెక్టులో ఈ సమస్యను కచ్చితంగా టేకప్ చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నల్లపాడు చెరువు అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత ప్రజలతో పాటు గుంటూరు ప్రజలకు కూడా ఈ చెరువు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పరిశీలనలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, సిటీ ప్లానర్ రాంబాబు, 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, జిల్లా మహిళ అధ్యక్షురాలు అన్నాబత్తుల జయలక్ష్మి, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గుంటూరు ప్రఖ్యాత్, స్థానిక టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, సూరిశెట్టి హరీష్, షేక్ షుకూర్, బత్తుల నాగరామయ్య, రావిపాటి మోహనరావు, బెలగాం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నల్లపాడు చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

నెలపాటు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ అనంతపురం వరకే...

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ కారణాలతో నెలపాటు ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని అనంతపురం వరకే నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17215 మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు అనంతపురం వరకే ప్రయాణిస్తుందన్నారు. ఈ కారణంగా నంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ ఒకటి నుంచి మే 1వ తేదీ వరకు అనంతపురం నుంచి ప్రయాణాన్ని మొదలు పెడుతుందని చెప్పారు.

గుంటూరు మీదగా సంత్రగచి - యశ్వంత్‌పూర్ ఏసీ ఎక్స్‌ప్రెస్

వారంలో ఒక రోజు గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న సంత్రగచి - యశ్వంత్‌పూర్ - సంత్రగచి ఎక్స్‌ప్రెస్‌ని వేసవి ఎండలు కారణంగా ఏప్రిల్ నెలలో పూర్తిగా ఏసీ త్రీటైర్ భోగీలతో రైల్వేశాఖ నడపనుంది. జడ్ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్ చౌదరి విజ్ఞప్తి మేరకు రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకొన్నది. నంబరు. 02865 సంత్రగచి - యశ్వంత్‌పూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ నెలలో ప్రతి గురువారం, నంబరు. 02864 యశ్వంత్‌పూర్ - సంత్రగచి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం ఏసీ భోగీలతో మాత్రమే ప్రయాణిస్తాయని రైల్వేవర్గాలు తెలిపాయి.

వైసీపీ సానుభూతిపరుల దురాగతం

● టీడీపీ నేత ఇంటికి అక్రమ రిజిస్ట్రేషన్



తమ ఇంటి ముందు శ్రీనివాసరెడ్డి, ఉషారాణి

అమరావతి, మార్చి 29(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మునగోడు గ్రామంలో తెలుగు దేశం నాయకుడు దివంగత పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే గణపా రామస్వామిరెడ్డి అన్నకు మారుడు గణపా శ్రీనివాసరెడ్డి భార్య పేరుమీద ఉన్న ఇంటిని, స్థలాన్ని గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతి పరులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటన ఆలస్యంగా వెలు గు చూసింది. వివరాలు.. శ్రీనివాసరెడ్డికి తన పూర్వీకుల ద్వారా వచ్చిన 164/1 లో 7.5 సెంట్ల భూమి లభించింది. దానిని ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 2008లో భార్య ఉషారాణి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఆ స్థలంలో ప్రభుత్వం ఇంటిని మంజూరు చేయగా 80శాతం ఇంటిని పూర్తిచేసి డబ్బులు అందుబాటులో లేక నిర్మాణం ఆగిపోయింది. అయింటిని పక్కనే ఉన్న గలబా రాములు, రాఘవమ్మ, శ్రీనివాసరావు, గోవిందమ్మలు గలబా వెంకట్రావుకు నాలుగు నెలల క్రితం సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. దీనికి సాక్షిగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గలబా సుబ్బారావు సంతకం చేశాడు. గలబా రాములుకు, శ్రీనివాసరెడ్డికి దారి నిమిత్తం కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎలాంటి స్పందన రాలేదు. అధికారులు వెంటనే స్పందించి ఉషారాణికి చెందిన ఇంటితో పాటు స్థలానికి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆర్ అండ్ బీ రోడ్లకు మహర్దశ

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారుల దశ మార్చేందుకు ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధు లు మంజూరు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికగా తీసుకొని మొత్తం ఏడు రహదారుల అభివృద్ధికి ఉపక్రమించింది. బాపట్ల జిల్లా పరిధిలో అద్దంకి నియోజకవర్గంలోకి వచ్చే ఐఎం రోడ్డు నుంచి ఎన్‌హెచ్5 వరకు 1.200 కిలోమీటర్ల పొడవునా మెరుగుపరిచేందుకు రూ. కోటి మంజూరు చేసింది. బల్లికురవ నుంచి ఎన్‌హెచ్5 వరకు 8 కిలోమీటర్ల పొడవునా రోడ్డు అభివృద్ధికి రూ. 2.40 కోట్లు, రేపల్లె నియోజకవర్గం పరి ధిలో బేతపూడి నుంచి మోర్లవారిపాలెం, పేటేరు మీదగా రావిఅ నంతవరం వరకు 6.400 కిలోమీటర్ల పొడవునా రోడ్డు అభివృద్ధికి రూ. 2.05 కోట్లు, పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజక వర్గంలో నుదురు పాడు, బోయపాలెం, డీఎస్ రోడ్డు, ఫిరంగిపురం రోడ్డులో 600 మీటర్ల పొడవునా అభివృద్ధికి రూ. 1.40 కోట్లు, పెదకూరపాడు బయ్యవరం రోడ్డులో 0 నుంచి 8/5 కిలోమీటర్ వరకు రూ. 2.05 కోట్లు, మాచర్ల నియో జకవర్గం పరిధిలో కోండ్రుముట్ల - బండ్లమోటు - దుర్గి రోడ్డులో 40వ కిలోమీటర్ నుంచి 54/065 కిలోమీటర్ వరకు రూ. 5 కోట్లు, పొన్నూరు నియోజకవర్గం పరిధిలో పెదకాకాని - వెనిగండ్ల - అగతవరప్పాడు - రెడ్డిపాలెం రోడ్డులో 0 నుంచి 5.900 కిలోమీ టర్ వరకు రోడ్ల అభివృద్ధికి రూ. 3.50 కోట్లు మంజూరు చేసింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్(రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి), అనగాని సత్యప్ర సాదు (రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి), ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట ఎమ్మెల్యే), భాష్యం ప్రవీణ్(పెదకూరపాడు ఎమ్మెల్యే), జూలకంటి బ్రహ్మారెడ్డి(మాచర్ల ఎమ్మెల్యే), ధూళిపాళ్ల నరేంద్రకు మార్ (పొన్నూరు ఎమ్మెల్యే) ప్రతిపాదనల మేరకు ఈ రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రేమ జంట ఆత్మహత్య



రంగనాయక్ (ఫైల్)

రెంటచింతల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన పశ్చిమబెంగాలు రాజధాని కోల్‌కత్తా నగరంలో శుక్రవారం చోటుచేసుకుంది. రెంటచింతల మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన నేనావత్ రంగనాయక్ (25) బయోమెడికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి కలకత్తాలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కంపెనీలో జోవితా అనే యువతితో సన్నిహితంగా మెలుగుతున్నారు. వివాహం చేసుకుందామనుకుంటున్న సమయంలో జోవితా కోల్‌కత్తాలోనే ఉండాలని కోరింది. దీంతో మనస్థాపం చెందిన రంగనాయక్ కలకత్తాలోని భరద్వాజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తానుంట నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రియుడి ఆత్మహత్య తట్టుకోలేక జోవిత కూడా ఆత్మహత్య చేసుకుంది. రంగానాయక్ మృతదేహాన్ని శనివారం పాలువాయి గ్రామానికి తీసుకొచ్చారు. కోల్‌కత్తాలోని భరద్వాజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

మైనర్‌ను పెళ్ళి చేసుకున్న బీటెక్ విద్యార్థి అరెస్టు

-14 రోజుల రిమాండ్

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికను ప్రేమ పేరుతో పెళ్ళి చేసుకున్న బీటెక్ విద్యార్థిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేసారు. నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన కోడూరు సంజయ్ (20)అనే యువకుడు పట్టాభిపురం మెయిన్ రోడ్డులో పాత ఆర్టీవో ఆఫీస్ దగ్గర ఒక ఫలూద షాపులో పని చేసే సమయంలో తోపుడు బండి మీద అరటికాయలు అమ్ముకునే అతని కుమార్తె అయిన బాలికను ప్రేమిస్తున్నానని మాట్లాడుతూ ఉండేవాడు. ఆ క్రమంలో సదరు బాలికను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఎవరికీ చెప్పకుండా గత ఏడాది ఆగస్టు 13న నంబూరులో ఉన్న కల్వరి టెంపుల్ కి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. తదుపరి ఇద్దరూ బాలిక ఇంటికి వెళ్ళగా ఇద్దరు కుటుంబ సభ్యులు, పెద్దలు మేజర్ అయ్యే వరకు చదువుకోమని చెప్పారు. బాలిక తొమ్మిదో తరగతి, సంజయ్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఈ విషయం బాలిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ కేసులో నిందితుడైన కోడూరు సంజయ్‌ను పోక్సో యాక్ట్ కింద పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ స్పందన 14 రోజులు రిమాండ్ విధించడంతో సంజయ్‌ను జిల్లా జైలుకు తరలించారు.

రైల్వే యార్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లి టౌన్, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రైల్వే యార్డులో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి చెందాడు. ఎస్ఐ జేఎస్‌రావు తెలి పిన వివరాల ప్రకారం యార్డు వెనుక ఉన్న పాడుబడిన క్వార్టర్స్‌లోని ఓ గదిలో ఉరికి వేలాడుతున్న మృతదేహాన్ని ఆర్‌పీఎస్ సిబ్బంది గమనించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి 30 ఏళ్ల ఉండవచ్చని మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందన్నారు. వారం క్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ఎస్ఐ జేఎస్‌రావు తెలిపారు. వీఆర్‌వో ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

డ్వాక్రా ఉత్పత్తులకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డు

పిడుగురాళ్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ఒకేరోజు అధిక మొత్తంలో కొనుగోలు చేసి డోర్ డెలివరీ చేసిన పిడుగురాళ్ల డ్వాక్రా మహిళలకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. పిడుగురాళ్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో పొదుపు సంఘం మహిళలు ఒకేరోజు లక్ష జూట్ బ్యాగ్‌లు బుకింగ్, డెలివరీ చేయడంతో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైంది. సంస్థ ప్రతినిధులు పంపిన ధ్రువీకరణ పత్రాలను శనివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతులమీదుగా మున్సిపల్ కమిషనర్ పీ శ్రీధర్, మెప్మా సిబ్బంది శ్రీనివాసు, రాయల్, పొదుపు సంఘం మహిళలు అందుకున్నారు.

నేటి నుంచి పశు బల ప్రదర్శన పోటీలు

బెల్లంకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల పశు బల ప్రదర్శన పోటీలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం పేర్కొన్నారు. న్యూ క్యాటగిరి విభాగంలో ప్రవేశ రుసుం రూ. 650, సమయం 20 నిమిషాలు, మొదటి బహుమతి రూ 40,116లు, ద్వితీయ బహుమతి రూ 30,116లు, మూడవ బహుమతి రూ 25,116లు, ఆరు పళ్ళ విభాగంలో ప్రవేశ రుసుం రూ 500, సమయం 15 నిమిషాలు, మొదటి బహుమతి రూ 25,116లు, రెండవ బహుమతి రూ 20,116లు, మూడవ బహుమతి రూ 15,116లు, రెండు పళ్ళ విభాగంలో ప్రవేశ రుసుం రూ. 300, సమయం పది నిమిషాలు, మొదటి బహుమతి రూ 20,116లు, రెండవ బహుమతి రూ 15,116లు, మూడవ బహుమతి రూ 12,116లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల వారు నల్లమేకల శ్రీహరిరావు, సెల్ నెంబరు 9885639505, బండి పల్లెకొండ 6300036959 నెంబర్లను సంప్రదించాలన్నారు.

3 నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం

నరసరావుపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు నరసరావుపేట కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్నామని డీఈవో ఎల్ చంద్రకళ శనివారం తెలిపారు. ఏడు రోజులలో మూల్యాంకనం పూర్తిచేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం 111 మంది చీఫ్ ఎగ్జామినర్‌లు, 651 మంది ఎగ్జామినర్‌లు, 270 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించటం జరుగుతుందన్నారు. ఎగ్జామినర్ ప్రతి రోజు 40 పేపర్లను మూల్యాంకనం చేయాలని, వీటిని స్పెషల్ అసిస్టెంట్లు పరిశీలిస్తారని చెప్పారు. మూల్యాంకనం పూర్తయిన వాటిలో 20 పేపర్లు చొప్పున చీఫ్ ఎగ్జామినర్లు పరిశీలించాల్సి ఉంటుందని, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ రోజుకు 20 చొప్పున, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ రోజుకు 45 చొప్పున మూల్యాంకనం చేసిన పేపర్లను పునఃపరిశీలించాలని చెప్పారు. ఈ క్రమంలో మార్కులు వ్యత్యాసం వస్తే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పదవ తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారని డీఈవో తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 521.70 అడుగులు ఉంది. 152.70 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5088 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1350, ఎల్ఎ ల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 13,928 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం వాయిదా

- సమావేశం ఆలస్యమవడంపై సభ్యుల అసహనం
- వాయిదా వేసిన ఇన్‌చార్జ్ మేయర్ సజీల

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో శనివారం జరగాల్సిన బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తూ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల ప్రకటించారు. నగరపాలక సంస్థ సమావేశం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ సమయానికి కార్పొరేటర్లు, అధికారులు, ఇన్‌చార్జి మేయర్ సమావేశానికి హాజరు కాలేదు. నగరంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలకు పెద్ద ఎత్తున కార్పొరేటర్లు, ఇన్‌చార్జి మేయర్ సజీల హాజరయ్యారు. కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి కౌన్సిల్ సమావేశానికి వచ్చేసరికి మధ్యాహ్నం 12 గంటలు అయింది. 12 గంటల 15 నిమిషాలకు కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. బడ్జెట్ సమావేశం ప్రారంభం కాగానే పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నాయని, ఇటువంటి సమయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించడం వల్ల సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాలేరని, దీనిని దృష్టిలో పెట్టుకొని సమావేశం వాయిదా వేయాలని కోరారు. దీనిపై టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ సభ్యుల విజ్ఞప్తి మేరకు సమావేశాన్ని వాయిదా చేయాలని సూచించారు. దీంతో ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల సమావేశాన్ని వాయిదా వేస్తూ ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో తేదీ ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, హాజరైన కార్పొరేటర్లు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శనివారం సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జ్ మేయరు సజీల, రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ పర్వదినం శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజుల పాటు ప్రత్యేకంగా ధార్మిక చింతనలో భాగంగా ఉపవాసాలు ఆచరించడంతో పాటు స్తోమత కలిగిన వారు పేదలకు జకాత్‌ను అందించి పుణ్య కార్యక్రమం చేస్తున్న ముస్లింలందరికి మంచి చేకూరాలని ఆకాంక్షిస్తున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జ్ మేయరు సజీల అన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ రోషన్ జమీర్ బాషా, మాజీ కార్పొరేటర్ షౌకత్, లాల్ వజీర్, మీరావలి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి మేయర్ సజీల



ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, అనుచరులు



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నాయకులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ప్రభంజనం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన కేవలం 9 నెలలలోనే అధికారంలోకి తెచ్చిన ఘనత నందమూరి తారక రామారావుకే దక్కుతుందని, పార్టీ ఆవిర్భావమే ప్రభజనం అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆమె పార్టీ జెండా ఆవిష్కరించి, భారీ కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగే ఆవిర్భావ వేడుకలకు 50 బస్సులు, 100 కార్లు, 100 బైకులు, 100 ఆటోలు ఏర్పాటు చేసి వేలాది మందితో భారీ ర్యాలీగా ఆమె తరలివెళ్లారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లు సమర్థవంతంగా పార్టీని ముందుకు నడుపుతూ, కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంటే ఆంధ్రప్రదేశ్ దశ, దిశను మార్చిన ఒక చరిత్ర. విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం.. రాజకీయ యవనికపై నవశకానికి నాంది అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచ దేశాలలో వినపడేలా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చిష్టి, ఎల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు సలీం, మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కోటా పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు, దుర్గాప్రసాద్, బద్రి, అన్వర్, ఐల శ్రీనివాసరావు, మల్లెంపూడి శ్రీనివాసరావు, కందుకూరి వెంకట్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరి జాతీయ కార్యాలయంలో జరిగిన వేడుకలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీ టీఎస్) ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బస్సులు, కార్లు, బైకులతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి పేదవారి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధి అనేది చూపించారని అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కోటి సభ్యత్వాలతో రికార్డు సృష్టించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మోహన్ కృష్ణ తదితరులు

న్యూరోసర్జన్ డాక్టర్ రామకృష్ణకు ఉగాది పురస్కారం

గుంటూరు మెడికల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరో సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గొల్ల రామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారానికి ఎన్నికయ్యారు. గత పదిహేనుళ్లుగా ప్రభుత్వ సర్వీసులో కొనసాగుతున్న డాక్టర్ రామకృష్ణ, వేలాది మంది రోగులకు మెదడు, వెన్నుపూస సంబంధిత సర్జరీలు నిర్వహించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసినా ఆయన సెలవు దినాల్లో గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యసేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. సామాజిక సేవలో భాగంగా పేద విద్యార్థులకు ఫీజులు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. నిరుపేదలకు వస్త్రదానం, అన్నదానం వంటివి కూడా నిర్వహించి పలువురి ప్రశంసలు పొందారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి న్యూరో సర్జన్ డాక్టర్ రామకృష్ణ పురస్కారం అందుకుంటారు.



న్యూరో సర్జన్ డాక్టర్ రామకృష్ణ

విజ్ఞాన్స్‌లో కోటక్ బిజ్‌ల్యాబ్స్ జీటీఎం, ఫండింగ్ వర్క్‌షాప్

గుంటూరు(విద్య), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టీబీఐ, టీ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కోటక్ బిజ్‌ల్యాబ్స్ జీటీఎం (గోటు మార్కెట్) అండ్ ఫండింగ్ వర్క్‌షాప్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్సో వ్యూ ఫౌండర్ అరుణ్ చిన్నస్వామి మాట్లాడుతూ స్కేలబుల్ టెక్ ఉత్పత్తులు రూపొందించాలంటే సరైన ప్లానింగ్, మంచి ఆర్కిటెక్చర్, క్లౌడ్ సొల్యూషన్స్, డేటాబేస్ ఆప్టిమైజేషన్ కీలకమన్నారు. స్టార్టప్ స్థాయిలో సరైన పద్ధతులు అనుసరిస్తే భవిష్యత్తులో టెక్నాలజీ ప్రొడక్ట్‌లను సులభంగా స్కేల్ చేయొచ్చన్నారు. మీ వ్యాపారం పెరుగుతున్నప్పుడు టెక్ ఉత్పత్తులు కూడా ఆ పెరుగుదలకు తగ్గట్టుగా స్కేల్ కావాలన్నారు. అయా విభాగాల డీన్లు, అధిపతు లు, విద్యార్థులు, దేశంలోని మారుమూల ప్రాంతాల నుంచి స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు



కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

గుంటూరు(విద్య), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి పూర్తిగా సాంకేతికతపై ఆధారపడకుండా, స్వీయ ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎల్ఎల్‌పీ టెక్నాలజీ కన్సల్టెంట్ సీనియర్ మేనేజర్ పవన్ సతీష్ కుమార్ అన్నవరపు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో థిక్ లైక్ ఎ క్లౌడ్ యాక్ట్‌లైక్ ఎఐ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో ఎదురయ్యే క్లిష్ట సమస్యలకు కృత్రిమ మేధా (ఎఐ) క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా పరిష్కార మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలు చేసి వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు సాంకేతికతను వినియోగించుకోవడం తప్పనిసరని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పవన్ సతీష్ కుమార్

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నెలాఖరు సందర్భంగా శని, ఆదివారాలు విద్యుత్ బిల్లులు చెల్లించేలా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, సెక్షన్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు శెలవుదినాలైనప్పటికీ బిల్లులు చెల్లించేందుకు కౌంటర్లు కొనసాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా మొబైల్ యాప్స్ ఫోన్‌పే, గూగుల్‌పేలలోనూ బిల్లులు చెల్లించవచ్చని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సుమారు 50 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి నాజ్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో అనారోగ్యంతో పడిపోయి ఉండగా 108 అంబులెన్స్‌లో ఈనెల 27న జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ 28న మధ్యాహ్నం చనిపోయాడు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచి మృతుని బంధువుల ఆచూకీ కొరకు ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. కొత్తపేట పీఎస్ ల్యాండ్ లైన్ నెంబర్ 08632221815కు గానీ, సీఐ వీరయ్య చౌదరికి 8688831320కు గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం అర్ధరాత్రి ధర్నా చేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే నసీర్ ఫ్లెక్సీలు తొలగించిన మున్సిపల్ సిబ్బంది

- ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి కార్యకర్తల నిరసన

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రంజాన్‌ను పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే నసీర్‌కు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే అనుకోకుండా శనివారం నగరపాలక సంస్థ సిబ్బంది నగరంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించారు. దీనిలో భాగంగా తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కూడా తొలగించారు. రంజాన్ పండుగకు ముందు రోజు మున్సిపల్ సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడాన్ని టీడీపీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు సహించలేకపోయారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ శనివారం రెడ్డిపాలెం, గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్, భారత్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సిబ్బంది, కార్యదర్శుల నిర్లక్ష్యం వలన పలు ప్రాంతాల్లో డంపింగ్ పాయింట్స్ ఉంటున్నాయన్నారు. రెడ్డిపాలెం శ్మశానం వద్ద చెత్త డంపింగ్ చేయడం గమనించి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబిని పరిశీలించి బ్రిడ్జిపై డస్ట్ పేరుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అమరావతి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై వచ్చి రాడ్‌తో దాడి

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణనగర్‌కి చెందిన కస్తూరి శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బ్రాడీపేట 2/13వ లైను వద్దకి చేరే సరికి వెనుక నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెంబడించి రాడ్‌తో దాడికి పాల్పడ్డారు. మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి ఇనుప రాడ్‌తో శ్రీనివాసరావు తల మీద కొట్టి వారిద్దరూ పారిపోయారు. శ్రీనివాసరావు తలకి రక్త గాయమైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 100 మంది కార్మికులను తొలగించడం అన్యాయం అని అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సమావేశానికి సీహెచ్ రామారావు అధ్యక్షత వహించగా టి.సంధ్యారాణి, పిల్లి మేనకరావు, ఆర్.సంగమేశ్వరరావు, చీలి నాగేశ్వరరావు, నూతక్కి వీరయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన గుంటూరు సిటీ, గుంటూరు వారి తోట, డోర్ నెం. 13-2-29రు కాపురస్తురాలు **జానికి రామన్** గారి భార్య **దంటు లక్ష్మి వెంకట బాల త్రిపుర సుందరి** గారి అనుమతి పొంది యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని **చల్లా వెంకటేశ్వరరావు** మరియు **ములుగుర్తి వేణుగోపాల్** గార్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నుండి కొనుగోలు చేసి వారి పేరిటికి REGD. SALE CERTIFICATE NO. **3971/2023** రిజిస్టర్ చేసుకొని వారి స్వాధీన హక్కు భుక్తములలో కలదని నమ్మించి మా క్లయింటుతో విక్రయ ఖరారుపడి విక్రయ బయానా అగ్రిమెంట్ వ్రాసుకొనియున్నారు. షెడ్యూల్ ఆస్తి పై తెలిపిన వారికి తప్ప ఇంక ఎవరికీ ఎటువంటి హక్కులు లేవని చెప్పి నమ్మించి అమ్ముతున్నారు. కావున షెడ్యూల్ ఆస్తి అమ్మకము గురించి ఎవరికీ ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ నోటీసు తారీకు నుండి ఏడు రోజులలోపు వారికి గల అభ్యంతరములు మా క్లయింటుకు గాని నాకు గాని లిఖిత పూర్వకముగా తెలియజేయవలెనని కోరుచున్నాము. లేని యెడల మా క్లయింటు పై వారి నుండి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు పొందురని ఆ తదుపరి వచ్చు ఎటువంటి క్లెయిములు మా క్లయింటు యొక్క హక్కులను బద్ధపరచజాలవని యావన్మందికి తెలియచేయటమైనది. ఈ పబ్లిక్ నోటీసు కొనుగోలుదారుల యొక్క కోరిక పై యివ్వటమైనది.

SCHEDULE : All that residential vacant site located at Guntur Dist., Pedakakani Sub-District, within the Agathavarapadu Village panchayat area, Agathavarapadu village bearing D. No. 78/B, an extent of 670 Sq. yards out of Ac. 2.63 cents as detailed below:- **Item No. 1:** an extent of 335 Sq. yards Bounded by:- **EAST** : 30 feet wide Road - 45 ft., **SOUTH** : Under mentioned Item No. 2 property - 67 ft., **WEST**: Property of Vijaya Builders - 45 ft., **NORTH**: Property of others - 67 ft.

Item No. 2: an extent of 335 Sq. yards Bounded by:- **EAST** : 30 feet wide Road - 45 ft., **SOUTH**: Property of Arhathunni Sulthana Begum - 67 ft., **WEST** : Property of Vijaya Builders - 45 ft. **NORTH:** Above mentioned Item No. 1 property - 67 ft. Within these boundaries Item Nos. 1 and 2 together an extent of **670 Sq. yards** of vacant site only

ఇట్లు : దాగంటి నరసింహారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, న్యాయవాదులు, కన్నవారితోట, గుంటూరు. సెల్ నెం: **7981296499**


గ్లాస్ ఫిటింగ్ పనులు జరుగుతున్న ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం

- పూర్తికావొచ్చిన ఇంటీరియర్ పనులు
- కొనసాగుతున్న గ్లాస్ ఫిటింగ్
- మరో ఎనిమిదెకరాల్లో ప్రజా వేదిక తరహా షెడ్డు

తుది మెరుగుల్లో సీఆర్‌డీఏ

మంగళగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం తుదిమెరుగులు దిద్దుకుంటుంది. రాజధాని అమరావతిలో తొలిగా ప్రారంభోత్సవానికి ఈ భవనం సిద్ధమైపోతున్న సంగతి తెలిసిందే. జీ+7 అంతస్తులతో రూపుదిద్దుకుంటున్న ఈ భవనంలో అటు ఇంటీరియర్ పనులు ఇటు వెలుపలి పక్క ఎలివేషన్ పనులను ఏకకాలంలో రేయింబవళ్లు నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని రాయపూడి పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్‌కు సమీపంలో నిర్మిస్తున్నారు. ఇంటీరియర్ పనులు దాదాపు పూర్తికావొస్తుండగా...బయటివైపు చేపట్టిన ఎలివేషన్ పనులు మాత్రం ఒకింత నిదానంగా జరుగుతున్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఎలివేషన్ వర్క్ అంతా అద్దాల బిగింపుకు సంబంధించినదై వుంది. దీంతో ఆ పనులను చాలా జాగ్రత్తగా నిర్వహిస్తున్నారు. ఇదే సందర్భంలో కార్యాలయ ప్రాంగణం సుమారు14.5 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడ చేస్తున్నారు.

ఇదిలావుండగా ఈ సీఆర్‌డీఏ కార్యాలయ భవనానికి ఎదురుగా అంటే తూర్పుదిశగా సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడే ఎనిమిదెకరాల విస్తీర్ణంలో భారీ షెడ్డును కాంక్రీటు దిమ్మెలతో నిర్మిస్తున్నారు. గత వారం రోజులుగా ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. సదరు ప్రాంగణంలో ఓపక్క జేసీబీలతో జంగిల్ క్లియరెన్స్ చేస్తూ ఇంకోపక్కనుంచి ఐరన్ బుట్టలను కడుతూ రాడ్ బెండింగ్ పనులను చకచకా జరిపించేస్తున్నారు. అదే సందర్భంలో ట్రాక్టర్ మిషనరీతో ఆగర్లను 30 అడుగుల లోతుగా తీసి క్రేన్‌ల సాయంతో వాటిల్లో ఐరన్‌బుట్టలను దించి ఆ వెంటనే రెడీమిక్స్ కాంక్రీటును పోస్తున్నారు. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. మొత్తం ఎనిమిదెకరాలలో రెండెకరాల విస్తీర్ణంలో షెడ్ల నిర్మాణం గావిస్తున్నారు. ఇది పీవీపీ స్టీల్ స్ట్రక్చర్ రూపంలో ప్రజావేదిక మాదిరి వుండబోతుంది. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగే సమావేశాల కోసం దీనిని కాన్ఫరెన్స్‌హాలుగా వినియోగించుకునేందుకు ఈ అతి భారీ షెడ్డును చాలా పక్కాగా నిర్మిస్తున్నారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం కూడ ఈ హాలును గతంలో ప్రజావేదిక మాదిరి వినియోగించుకునే అవకాశం వుంది. గత 2018లో ఈ ప్రాంతాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం జపనీస్ హ్యూమన్ ఫెసిలిటీస్ సెంటర్ కోసం జపాన్ సంస్థకు కేటాయించింది. ప్రస్తుతం ఆ కేటాయింపులను రద్దు చేసి దానిలో ప్రజా వేదిక తరహా షెడ్డును నిర్మిస్తున్నారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఆరు మాసాలలోగా ఈ నిర్మాణ పనులను పూర్తిచేసి సీఆర్‌డీఏకు అప్పగించాలని ఎగ్రిమెంట్‌లో నిబంధన విధించారు.


ఆగర్లలో ఐరన్ బుట్టలు దించుతున్న దృశ్యం


సీఆర్‌డీఏ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న షెడ్డు నిర్మాణ ప్రాంతం

నాగార్జున సాగర్‌కు.. మహర్దశ

- పర్యాటక అభివృద్ధికి రూ. 25 కోట్లు
- స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కేంద్రం గుర్తింపు
- నిధుల మంజూరుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృషి



నరసరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్‌కు మహర్దశ పట్టనుంది. పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ. 25 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సాగర్‌ను అభివృద్ధి చేయనున్నారు. నిధుల మంజూరుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన కృషి ఫలించింది. త్వరలోనే పనులు చేపట్టేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది.

పర్యాటక కేంద్రం నాగార్జున సాగర్‌లో బౌద్ధ వారసత్వం, సాంస్కృతిక చిహ్నాలను సుసంపన్నం చేస్తూ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్ర చిహ్నాలతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఈ నిధులతో చేపట్టే అభివృద్ధితో పర్యాటకులను మరింతగా ఆకట్టుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ డైరెక్టరేట్ వివరణాత్మక ప్రదర్శనను అందించింది. ఈ అభ్యర్థన మేరకు కేంద్ర పర్యవేక్షణ కమిటీ ఈ ప్రాజెక్టును ఆమోదించింది. మంజూరైన నిధులతో నాగార్జున సాగర్‌లో బౌద్ధ నేపథ్య ఉద్యానవనాలు, బౌద్ధ చిహ్నాల అభివృద్ధితో పాటు రెస్టారెంట్లు, సీసీ టీవీ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. నాగార్జున సాగర్ పర్యాటక కేంద్రం వెబ్‌సైట్ అభివృద్ధి చేస్తారు. ఇక్కడ చూడదగిన ప్రదేశాల చిత్ర మాలికను వెబ్‌సైట్‌లో పొందుపరచి పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తారు. ఈ పథకాన్ని ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు నిర్వహణ బాధ్యతలను కేంద్రం అప్పగించింది. ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలన్న కాల పరిమితిని విధించారు. పర్యాటక విభాగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసే ఈ పథకాన్ని బౌద్ధ ఆనవాళ్లకు ప్రతీకగా ఉన్న నాగార్జునసాగర్ ప్రాంతానికి వర్తింప చేయాలని.. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు.. సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనను పంపించారు. నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఫలితంగా నేడు రూ. 25 కోట్లు మంజూరు అవ్వటం పట్ల శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, అత్యంత త్వరగా అభివృద్ధి జరిగేందుకు కృషి చేస్తామని వివరించారు.


ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ఉగాది సందడి

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో శనివారం ఉగాది సందడి నెలకొన్నది. తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జరుపుకునేందుకు ప్రజలు పూజా సామాగ్రి కొనుగోళ్ళకు ప్రత్యేక ఆసక్తి చూపారు. ఉగాది పర్వదినం కోసం గుంటూరులోని బ్రాడీపేట, కొరిటెపాడు, గుజ్జనగుండ్ల, బృందావన్‌గార్డెన్స్ , చుట్టుగుంట, చౌత్రా సెంటర్, మార్కెట్, లాలాపేట ప్రాంతాల్లో పూజా సామాగ్రి కొనుగోళ్ళతో కోలాహల వాతావరణం నెలకొన్నది. ఉగాది పర్వదినానికి ముఖ్యంగా మామిడి ఆకులు, వేప పూత, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, అరటికాయలు వంటి పూజ ద్రవ్యాలను కొనుగోళ్ళు పెద్ద ఎత్తున జరిగాయి. బంతి పూలు నాలుగు మూరలు 50 రూపాయలు, అరటిపండ్లు డజను రూ.50ల నుంచి రూ. 80ల వరకు విక్రయించారు. ఇదే అదునుగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. మామిడి ఆకులు, వేప పూత, అరటి పండ్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. మరో వైపు కిరాణా షాపులు, వస్త్ర దుకాణాల్లో కూడా కొనుగోళ్ళ కోలాహలం కనిపించింది.


పూలు, మామిడి ఆకుల కొనుగోళ్ల కోలాహలం



మిర్చి యార్డులో రూ. 347 కోట్ల అవినీతిపై చర్యలకు సిద్ధం

-గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం

గుంటూరు సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి యార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా బాధ్యులపై అభియోగాలు నమోదు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు మార్కెటింగ్ కమిషనరేట్‌కు చేరినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వం హయాంలో గుంటూరు మిర్చి యార్డు వేదికగా భారీ అవినీతి జరిగిన విషయం విదితమే. ప్రభుత్వం మారిన తర్వాత తెలుగుదేశం పార్టీ నేతలు చేసిన ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. యార్డులో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు గత ఏడాది నవంబరులో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గడచిన ఐదేళ్ల కాలం లో రూ. 347 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగినట్టు నివేదికలో పేర్కొన్నారు. యార్డులో పనిచేస్తున్న 20 మంది అధికారులు, సిబ్బందికి పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. నివేదిక వెలువడిన నెలలు గడిచినా చర్యలకు ఉపక్రమించక పోవటంపై నిరసన వ్యక్తం అయ్యింది. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న 20 మంది మార్కెటింగ్ అధికారులు, సిబ్బందిపై తొలుత అభియోగాలు నమోదు చేస్తారు. అనంతరం బాధ్యులైన ఉద్యోగులకు నోటీసులు జారీ చేస్తారు. ఉద్యోగుల సమాధానం ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటారు. ఈ ఉత్తర్వులతో మార్కెటింగ్ శాఖలో కలకలం రేగింది.

ఎడ్ల బల ప్రదర్శనను చూస్తుంటే.. పూర్వపు రోజులు గుర్తు కొస్తున్నాయి

- కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలిరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ లేని రోజుల్లో వ్యవసాయానికి రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది ఎడ్లేనని వాటి బల ప్రదర్శనను తెనాలిలో ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణం సంతరించుకుని పూర్వపురోజులు గుర్తుకొచ్చాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్లబలప్రదర్శన, పశుపాల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దృఢమైన శరీరం, నడకలో రాజసం పందెంలో పౌరుషం కలబోసిన జాతి ఒంగోలు జాతి ఎడ్లన్నారు. యాంత్రీకరణ పెరిగిన రోజుల్లో పూర్వీకుల ఆనవాయితీగా వస్తున్న ఎడ్ల బలప్రదర్శనను నేటి తరంలో కూడా నిర్వహించుకోవడం గొప్పవిషయమన్నారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఏర్పాటు చేసి వేలాది మంది రైతుల సమక్షంలో నిర్వహించడం సాధారణ విషయం కాదరన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మన సంస్కృతి ఉట్టిపడేలా బల ప్రదర్శనను చేపట్టిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే నక్కాఆనంద్‌బాబు మాట్లాడుతూ ఎడ్ల బల ప్రదర్శనతో పాటు పశుపాల ప్రదర్శన, వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనలు కూడా రైతులకు మేలు చేకూరుస్తాయని అన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ అంతరించి పోతున్న ఎడ్లబల ప్రదర్శన కళను తిరిగి నిలబెట్టిన ఘనత ఆల పాటి రాజేంద్రప్రసాద్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు మన ఆస్తి అన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ క్రిష్టినా, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లిమాణిక్యాలరావు పలువురు నాయకులు ప్రసంగించారు.


ఎడ్ల బలప్రదర్శనలో కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

మూగజీవాల దప్పిక తీరుస్తున్న ఫామ్‌పాండ్స్


వేసవి తాపానికి ఫామ్‌పాండ్‌లో నీరు తాగుతున్న గొర్రెల మంద

బాపట్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వేసవితాపానికి అల్లాడిపోతున్న మూగజీవాలకు ఫామ్‌పాండ్స్ దప్పిక తీరుస్తున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఫామ్‌పాండ్స్ తవ్వేందుకు పెద్దఎత్తున ప్రోత్సహించారు. దీంతో సన్న,చిన్నకారు రైతులు సైతం తమకున్న భూమిలో కొంతప్రాంతంలో పాండ్స్‌తవ్వారు. సాగునీటి సరఫరాలో ఆలస్యమైనట్లు నారుమడులకు నీరందించేందుకు, పొలాలు బెట్టకురాకుండా కాపాడుకునేందుకు ఉపయోగపడే ఈ ఫామ్‌ఫాండ్ ప్రస్తుతం వేసవిలో మూగజీవాల దప్పిక తీరుస్తున్నాయి. నియోజకవర్గంలోని కర్లపాలెం మండలంలో అప్పట్లో తవ్వించిన ఫామ్ ఫాండ్స్ ఇప్పటికి అదేవిధంగా ఉండటంతో తీరప్రాంతాలలో గొర్రెలపెంపకందారులు ఖాళీగా ఉన్న పొలాలకు వాటిని తీసుకొచ్చి మెపుకొని ఫామ్‌పాండ్స్‌లో నీటిని తాగిస్తున్నారు. ఎంతోఉపయుక్తంగా ఉన్న వీటిని ప్రోత్సహించి మరెన్నో తవ్వించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేస్తున్నారు. అదే విధంగా గతంలో తవ్వినవాటికి మరమ్మత్తులు చేసుకునేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తే తవ్వించి ఎక్కువ నీరు నిల్వ ఉండేవిధంగా చూస్తామని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నానాటికి అడుగంటి పోతున్న నీటిని సంరక్షించి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీటిని, నీటినిల్వలు ఉండేవిధంగా ఫామ్‌ఫాండ్స్ తవ్వించటంతోపాటు గతంలో తవ్విన వాటిని మరమ్మత్తులు చేస్తే బాగుంటుందని నీటి పరిశోధన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.


తీరంలోని పొలాలలో మేత మేస్తున్న గొర్రెల మంద

కృష్ణానదిలో గాలు మార్గం

అధికారులు తవ్వేసినా మళ్లీ పునరుద్ధరణ
గాజుల్లంక - శ్రీకాకుళం మధ్య అక్రమార్కుల బరితెగింపు

కొల్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో కృష్ణా - బాపట్ల జిల్లాలోని నది వెంబడి గ్రామాలైన గాజుల్లంక - శ్రీకాకుళం మధ్య అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ద్రవ్య అవసరాల పేరుతో నదిలో కొంత కాలం క్రితం గాలు మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా ఇరు జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులతో పాటు, పశుగ్రాసం రవాణా అవుతున్నాయి. నిఘా, సోదాలు లేకపోవడంతో


కృష్ణానదిలో గాజుల్లంక - శ్రీకాకుళం గ్రామాల మధ్య వేసిన గాలు మార్గాన్ని తవ్వేస్తున్న యంత్రం

అక్రమార్కులకు ఈ మార్గం వరప్రదాయినిగా మారింది. అటు, ఇటు గంజాయి, నాటుసారా తదితరాలను అక్రమార్కులు రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లా శ్రీకాకుళం పరిధిలో నిత్యం రాత్రివేళల్లో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి లారీలకు నింపి ఇదే మార్గం గుండా తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా ఇరుగ్రామాలకు చెందిన కొంత మందికి భారీ ఆదాయం సమకూరుతుందని సమాచారం. గాలు మార్గంపై వెళ్లినందుకు ఒక్కో లారీకి రూ.400 వసూలు చేస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు కూడా భారీగానే ముడుపులు అందుతు న్నట్లు సమాచారం. అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసు, ఆర్సీ అధికారులకు ఫిర్యాదులు వెల్లివెత్తడం తో శనివారం రాత్రి ఆర్సీ ఏఈ తన సిబ్బందితో వచ్చి గాలు మార్గాన్ని తవ్వించారు. అయితే అధికారులు వెళ్లిన నిమిషాల వ్యవధిలోనే నిర్వాహకులు అదే యంత్రంతో గాలు మార్గాన్ని పునరుద్ధరించారు.

ఆదరణ లేని కోర్సులకు ఏఎన్‌యూ శుభం కార్డు

పెదకాకాని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్ల క్రితం ప్రారంభించిన సెల్ఫ్ సపోర్ట్ కోర్సులలో ఆదరణ లేని కొన్ని కోర్సులను మూసివేసేందుకు అకడమిక్ సెనేట్ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముందుగా వర్సిటీ 2025-26 వార్షిక బడ్జెట్‌తో పాటు కొన్ని నూతన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను తొలుత రూ. 69 కోట్ల 52 లక్షల బ్లాక్ గ్రాంట్‌గా, ఆ తరువాత అదనపు గ్రాంట్ కింద రూ. 14 కోట్ల యాభై లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. వర్సిటీ అభివృద్ధిలో లక్ష్యాలు సాధించేందుకు మౌలిక వసతులు కల్పించేందుకు నూతన ప్రతిపాదనలు చేసినట్టు వివరించారు. అందులో భాగంగానే ఇరాక్, లిబియా, మయన్మార్, థాయిలాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల నుంచి విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు 2024-25 విద్య సంవత్సరానికి రూ. కోటి 75 లక్షల కేటాయించినట్లు వివరించారు. ఈ ఏడాది కంప్యూటర్ సైన్స్ కోర్సులకు, నూతన భవన నిర్మాణానికి 28 కోట్ల 75 లక్షలు విడతల వారీగా ఖర్చు చేసేందుకు బడ్జెట్లో ప్రతిపాదనలు పెట్టారు. కాగా గత ఐదేళ్లలో ప్రారంభించిన కోర్సుల నిర్వహణపై వీసీ, రెక్టార్‌ల ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించారు. ఇందులో ఓఎస్‌డీ రవికుమార్, ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్స్ సురేష్ కుమార్, వీరయ్యలు సభ్యులుగా ఉన్నారు. వీరు వర్సిటీలో ఏర్పాటు చేసిన సెల్ఫ్ సపోర్టు కోర్సుల నిర్వహణను అధ్యయనం చేసి నివేదిక అందజేశారు. అందులో భాగంగా ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్, ఎల్‌ఎల్‌ఎం కోర్సులో లా ఆఫ్ క్రైమ్స్, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ కోర్సులను మూసివేస్తున్నట్లు రెక్టార్ ఆచార్య రత్న షీలామణి వెల్లడించారు. భరతనాట్యం, కూచిపూడి, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సులను కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేస్తున్నట్లు వివరించారు. అయితే ప్రవేశాలు తక్కువగా ఉండి పర్మినెంట్ అధ్యాపకులు పర్యవేక్షణలో ఉన్న కోర్సులను కొనసాగించాలని కమిటీ ప్రతిపాదించడంతో, ఆ ప్రతిపాదనలను అకడమిక్ ఆమోదించింది. అంతకు ముందు వీసీ గంగాధరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాక్ ప్లస్ గ్రేడ్ సాధించిందని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుతో వర్సిటీ అభివృద్ధి విస్తృతంగా ముందుకు సాగుతుందని వివరించారు. అందులో భాగంగానే విదేశీ యూనివర్సిటీలతో విద్యాసంస్థలతో ఎంఓయులు కుదుర్చుకున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో మాజీ వీసీ ఆచార్య రాఘవులు, పాలకమండలి సభ్యులు ఆచార్య కే సుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్, ఆచార్య వి. వెంకటేశ్వరరావు, డాక్టర్ సాహెద్ అక్తర్, డైసీ, ప్రిన్సిపల్స్, డీన్‌లు, బిఓఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రభుత్వ ప్రతినిధులు, సేనేట్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



ఐతానగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పూర్ణచంద్, పార్టీ నాయకులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెనాలి, వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఎగుర వేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మునిసిపల్ కార్యాలయం కూరగాయల మార్కెట్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐతానగర్ టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నీటి సంఘం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, నన్నపనేని సుధాకర్, కాకుమాను కనక రాంబాబు, వేమూరి గౌతమ్, అత్తోట శరత్, జొన్నకూటి సుధామాధవి, కన్నెగంటి మురళీకృష్ణ, నలుకుర్తి రమేష్, పోపు రామ్మోహనరావు, వసంతం అశోక్, కాకుమాను వెంకటేశ్వరరావు, కన్నెగంటి శివ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 38వ వార్డులో ఆ పార్టీనాయకులు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అంగలకుదురులో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, సీనియర్ పార్టీ నాయకులు, హెచ్‌సీవీ ఎండీ కరణం వెంకటేశ్వరావుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాస్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని కంచర్లపాలెంలో ఆ గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చుక్కపల్లి భరత్, రాశపల్లి అనిత, గాలి సాంబశివరావు, కఠెవరపు అజయ్‌బాబు, యర్రంగుంట్ల దేవసహాయం, కోపల్లె శ్రీనివాసరావు, గాలి శారద తదితరులు పాల్గొన్నారు. శివాజీచౌక్‌లో గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ పార్టీ నాయకులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదల కోటేశ్వరరావు, పాటిబండ్ల గోపి, మేక దినేష్, వల్లూరి నారాయణ ప్రసాద్, ధూళిపాళ్ళ కార్తీక్, సుధీర్, బాలకృష్ణ, హరికృష్ణ, బాజీ పాల్గొన్నారు. నందివెలుగులో నన్నపనేని లింగారావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఇరుకలపాటి శేషగిరిరావు, ఆళ్ళమణిరెడ్డి, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, బెజవాడ భాగ్యరావు, ధూళిపాళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మారీసుపేట శాంతినగర్‌లో పినపాటి రవీంద్ర, చల్లగాలి శివశంకరరాజు, ఫణిదపు దుర్గ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చినరావూరులోని 15వ వార్డు రావిచెట్టు వద్ద వార్డు అధ్యక్షురాలు వాసిరెడ్డి సులోచన ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు మురళి, నాగభూషణం



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, తదితరులు

అంగలకుదురు గణేష్‌యూత్ ఆధ్వర్యంలో

తెనాలి రూరల్, మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురు గణేష్‌యూత్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కాంస్యవిగ్రహానికి టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, పలువురు సీనియర్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కనగాల శ్రీనివాస్, పలువురు టీడీపీనాయకులు, తెలుగుమహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి ఎన్టీఆర్

పొన్నూరుటౌన్, చేబ్రోలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఘనంగా జరిపారు. పొన్నూరులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని నాయకులు ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంతో పాటు మండలంలోని 29 గ్రామాల కూడళ్లలో వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో టీడీపీ పతాకాలను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబూరావు, మాదాల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, బొర్రు రామారావు, లక్ష్మీనారయణ చౌదరి, చెన్నుపాటి భాస్కర్, పిన్నమనేని కోటేశ్వరరావు, షేక్ బాజీ సాహెబ్, చిలకా విజయ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ముగ్బుల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు మండలంలోని 13 గ్రామాలలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నారాకోడూరులో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయం, మండల గ్రామాల్లో వేడుకలు జరిపారు.

● కొల్లిపర, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.

కొల్లిపరలో జెండాను ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు



నాయకులు టీడీపీ జెండాలను ఎగురవేశారు. కొల్లిపరలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంటర్‌లో జెండాను ఎగుర వేశారు. వల్లభాపురంలో దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, కంచర్ల అమృతరాజు, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, షేక్ రఫీ, ఆరిమండ వెంకటరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, షేక్ ఇర్ఫాన్, నక్కా సంసోన్, అవుతు సంజీవరెడ్డి, దాసరి నరసయ్య పాల్గొన్నారు.



బాల్యం కట్టుతప్పితే జీవితం చీకట్లోనే..

● న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని

తెనాలి క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బాల్యం కట్టుతప్పితే వారి భావి జీవితం చీకట్లోనే గడిచిపోతుందని తెనాలి ఫోక్సో కోర్టు, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం ఫోక్సో చట్టంపై న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందివెలుగులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, మానసిక స్థిరత్వం, సమర్థత, ఆలోచనల్లో సమతూకం, పిల్లలకు చిన్నతనం నుండి నేర్పించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను గమనిస్తూ ఉండాలని తెలిపారు. బాలబాలికలపై ఇటీవల అఘాయిత్యాలు పెరిగాయని, అలాంటివి కఠినంగా అణచివేయడానికి 2012లోనే ఫోక్సో యాక్టు తెచ్చారన్నారు. ఏదైన సమస్య తలెత్తినప్పుడు మండల న్యాయ కమిటీకి సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, ఎస్‌ఐ ప్రతాప్, న్యాయ సేవాధికార సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనీల్‌కుమార్, ఎంపీటీసీ విజయలక్ష్మి, నాగళ్ల హరీష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉమేష్‌చంద్ర జయంతి

తెనాలి, మారీసుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ ఉమేష్‌చంద్ర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర కాంశ్య విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అగ్నిమాపక శాఖ అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ఐపీఎస్ అధికారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు రమేష్‌బాబు, రాములనాయక్, ఎస్సైలు ప్రకాష్‌రావు, ప్రతాప్, కన్నెగంటి మురళి, ఈదర వెంకట పూర్ణచంద్, పావులూరి రాంబాబు, ఐనంపూడి కోటేశ్వరావు, ముద్దాభక్తుని రమణయ్య, జాస్తి భుజగం, దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అగ్నిమాపక శాఖ డీజీ ప్రతాప్, సీఐలు, ఎస్సై తదితరులు





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

మంచినీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంచినీటి ఎద్దడిలేకుండా చూసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారీ సమీక్షించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, డీటీ రాజేష్, ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఏవో వెంకట్రావు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

వైభవంగా ప్రారంభమైన బాజీ బాబా ఉరుసు మహోత్సవం

పెదకాకాని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో బాజీ బాబా ఉరుసు మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. బాజీ బాబా గుర్రంలో ప్రవేశించి పెదకాకాని, వెనిగండ్ల వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పాల్గొన్నారు. తొలుత దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు, అనంతరం ఉరుసు మహోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఉరుసు మహోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వడ్లమూడిలో ఇఫ్తార్ విందు

పొన్నూరుటౌన్(చేబ్రోలు), మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లమూడిలో శుక్రవారం రాత్రి మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సలాం, టీడీపీ నాయకుడు మేడుకొండూరు నరేష్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేధూళిపాళ్ల నరేంద్రకుమార్, జడ్పీ చైర్మన్ హెనీ క్రిష్టినా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. .ఈ సందర్భంగా మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహిద్దీన్, మాజీ ఎంపీపీ ఖాదర్ భాషా, మండల టీడీపీ అధ్యక్షుడు మైలా రామరాజు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వీరంకి రంగారావు పాల్గొన్నారు.

పనిచేయని అధికారులపై మునిసిపల్ చట్టం ప్రయోగిద్దాం

● చైర్‌పర్సన్ రాధికకు కౌన్సిలర్ల వినతి

తెనాలి, మారీసుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సౌకర్యాలు మెరుగు పరుస్తూ పురపాలక సంఘానికి మంచిపేరు తెచ్చేలా కౌన్సిల్ సభ్యులు కృషిచేస్తుంటే కొందరు అధికారుల నిర్లక్ష్యంతో చెడ్డపేరు వస్తుందని అటువంటి వారిపై మునిసిపల్ చట్టం ప్రయోగిద్దామని చైర్‌పర్సన్ రాధికకు కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు వినతిపత్రం అందించారు. శనివారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలో వారు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ నిర్లక్ష్యంగా ఉన్నవారిపై సభ్యులు కోరినపుడు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మునిసిపల్ నిధుల నుండి అదనపు ఖర్చులు పెట్టిన విధానంపై కౌన్సిల్ సభ్యులకు తెలపాలని టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి పట్టుపట్టారు. దీనిపై కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ప్రతి జమాఖర్చుకి నిర్దిష్టమైన బిల్లులు ఉన్నాయని ప్రతీది ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశామని తెలిపారు. వివరాలు కావాలంటే కౌన్సిల్ సభ్యులకు అందిస్తామన్నారు.



చైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిల్ సభ్యులు



ఇండోర్ స్టేడియంలో సంచులు పంపిణీ చేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పొన్నూరుటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ 10వేల విలువైన చేతి సంచులను పట్టణంలోని డీవీసీ ఇండోర్ స్టేడియం, కూరగాయల మార్కెట్ సెంటర్‌లో కమిషనర్ పంపిణీ చేశారు అనంతరం ప్లాస్టిక్ సంచులను వినియోగించబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవిరాకేష్, నన్నపనేని బాలకృష్ణ, వీరయ్య, సాధు ప్రసాద్, బి.శ్రీనివాసరావు, వాకర్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు

పొన్నూరు టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు జిల్లాలోని పాలరైతులకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులు పాడిపంటలతో లాభాసాటిగా ఉండాలని, ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

తెనాలి అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏవో శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని, మద్దతు ధర ప్రకటించకపోవడంతో రైతులు నష్టపోతారని చెప్పారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ములకా శివకుమారి, వేజండ్ల తబిత పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


తెనాలి అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఎంటీఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, సుమంత్ కోరారు. ప్రత్యక్ష పోరాటానికిగాను మున్సిపల్ ఉన్నతాధికారులకు శనివారం ధర్నా నోటీసు అందించామన్నారు. ఏప్రిల్ 17న కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి చలో కమిషనరేట్ చేపట్టామని తెలిపారు.

మొవ్వా విజయలక్ష్మి స్మారక సమితి వితరణ

తెనాలి అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మొవ్వా విజయలక్ష్మి స్మారక సమితి ఆధ్వర్యంలో శనివారం పోలీసులకు కూలింగ్ గ్లాసులు, టోపీలు, మాస్కులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ బి.జనార్ధనరావు మాట్లాడుతూ సమితి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు మొవ్వా సత్యనారాయణ, ఎస్‌ఐ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తెనాలి, మారీసుపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. శనివారం త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతి చెంది ఉన్నాడు. స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు త్రీటౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

















కోదండ రాముడిగా నృసింహస్వామి



కోదండ రాముడి అలంకారంలో లక్ష్మీనృసింహస్వామి

మంగళగిరి సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామి కోదండరాముడిగా భక్తులను అలరించారు. ఈ ఉత్సవానికి మంగళగిరి వాస్తవ్యులు కంచాల హరినాథ ప్రసాద్ సోదరులు కైంకర్యపరులుగాను, గుంటూరుకు చెందిన న్యాయవాది జీ.సాయికృష్ణ శ్రీనివాస్ ఆస్థాన కైంకర్యపరులు గాను వ్యవహరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

● నల్లమడ రైతు సంఘ జిల్లా నాయకుడు కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పొగాకును ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా నల్లమడ రైతు సంఘ నాయకులు కోరారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొగాకు కంపెనీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొగాకు రైతులు పడుతున్న బాధలను ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. బర్లీ పొగాకు మార్కెట్‌ను కంపెనీలు వెంటనే ప్రారంభించాలని, గతేడాది ధర ప్రకారం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, బర్లీ పొగాకును కూడా బోర్డులో చేర్చాలని కోరారు. దీనిపై కంపెనీల ప్రతినిధులు మిగతా ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.గంగయ్య, పాలేటి వీరయ్య, కుర్రా హరిబాబు, గోవాడ సత్యనారాయణ, దొప్పలపూడి హరిబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పుల్లడిగుంటలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉప్పుటూరి చినరాములు

వట్టిచెరుకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లడిగుంటలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్‌టీఆర్ విగ్రహానికి ఉప్పుటూరి చినరాములు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గుంటుపల్లి సదాశివరావు, యంపరాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

గుంటూరు రూరల్ మండలపరిధిలోని నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉప్పుటూరి చినరాములు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుడు ఉప్పుటూరి రామ్‌చౌదరి మజ్జిగ ప్యాకెట్లను అందించారు. వీటిని ట్రస్టు అధ్యక్షుడు ఉప్పుటూరి చినరాములు విద్యార్థులకు ప్యాకెట్లను అందజేశారు.

జిల్లాలో జనసేన పార్టీ పటిష్టతకు చర్యలు : గాదె

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంస్థాగతంగా జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం గుంటూరులోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను మండలం పాండ్రపాడుకు చెందిన పలువురు మహిళలు, స్థానికులు గాదె సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేనాని పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధి తో డిప్యూటీ సీఎం హోదాలో ఆయన చేస్తున్న కృషికి ఆకర్షితులైన నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు జనసేనలో చేరినట్లు వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చట్టాల త్రినాధ్, కాకుమాను మండల అధ్యక్షుడు గద్దం శ్రీనివాసరావు, నాగరాజు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి భరోసా పీ4 ఫార్ములా

● పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదకుటుంబాన్ని 22 సంవత్సరాల పాటు ఆదుకునే విధంగా పీ4 ఫార్ములాను అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడులో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత నిమ్మగడ్డవారిపాలెం సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిపుష్టి కలిగిన వారు, ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలు ఈ విధంగా సాయం అందించాలనే ఉద్దేశ్యం ఉన్న వారిని గుర్తిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 2వేల మంది పేద కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. ప్రతి ఒక్కరికి రెండు పేదకుటుంబాలను దత్తత నివ్వడంతో పాటు అగ్రిమెంట్ కూడా చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, చిన్నం శ్రీకాంత్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, మల్లం రామకృష్ణ, వెలివెల్లి సుబ్బారావు, బైనబోయిన శివన్నారాయణ, ఆలపాటి పాండురంగారావు, కస్నేగంటి అంకమ్మరావు, భాగ్యారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగులేన్ల విస్తరణకు 60 కోట్లు మంజూరు

గుంటూరు నుంచి పర్చూరు వెళ్లే పాతమద్రాసు రోడ్డులో 8వ కిలోమీటరు నుంచి 22వ కిలోమీటరు వరకు నాలుగు లైన్ల విస్తరణతో పాటు ప్రత్తిపాడులో సెంట్రల్ ఏర్పాటుకు 60 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే బూర్ల తెలిపారు. నియోజకవర్గానికి రెండు వందల కోట్ల రూపాయల నిధులు అడగ్గా తొలుత 60 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే ఐదవ మైలు వరకు రోడ్డు విస్తరణ పూర్తయిందని, మూడో విడతలో పర్చూరు వరకు రోడ్డును విస్తరిస్తామని తెలిపారు.

● **కాకుమాను (ఆంధ్రజ్యోతి):** కాకుమాను మండల పార్టీ కార్యాలయంలో టీడీపీ జెండాను మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి ఎగురవేశారు. టీకే పాలెం రహదారిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొమ్మూరులో టీడీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టిన్ టీడీపీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్ని గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, నల్లమోతు పూర్ణచంద్రరావు, మామిళ్లపల్లి రాంగోపాల్, శరత్ బాబు, నన్నపనేని ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

● **పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంట్యాల శ్రీధర్, బండి నాగబాబు, రావి శివ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే బూర్ల

పెదనందిపాడు జుమ్మామసీదులో శనివారం జరిగిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే బూర్ల పాల్గొన్నారు. తొలుత మత పెద్దలు నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ ఖలీల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని, విందును ప్రారంభించారు. ముస్లింల సంక్షేమం కోసం టీడీపీ పాటుపడుతుందని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశంపార్టీతోనే సాధ్యం

● ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య

● మంగళగిరిలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించిన నేతలు



గుండిమెడలో కేక్ కట్ చేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

మంగళగిరి సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ వేడుకలను మంగళగిరి పార్టీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీమంత్రి డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు విగ్రహాలకు నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మంగళగిరి డాక్టర్ అంజనేయ కాలనీ, వివిధ వార్డుల్లో టీడీపీ నేతలు పార్టీ జెండాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, తోట పార్థసారధి, షేక్ రియాజ్, మున్నంగి శివశేషగిరిరావు, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, ఆకురాతి నాగేంద్రం, కారంపూడి చిరంజీవి, జొన్నాదుల బాలకృష్ణ, అబ్దుల్ మజీద్, రంగిశెట్టి పెద్దబ్బాయ్, మద్దిరాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొనేందుకు మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ ఆధ్వర్యంలో పెదవడ్లపూడి నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.



పెదవడ్లపూడి నుంచి ర్యాలీగా బయల్దేరిన జవ్వాది కిరణ్‌చంద్ తదితర పార్టీ శ్రేణులు

గుండిమెడలో ఘనంగా..

తాడేపల్లి టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుండిమెడ రమేష్‌బాబు, గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, పరుచూరు భాష్యకాచార్యులు తదితరులు పాల్గొన్నారు. వడ్డేశ్వరంలో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధు, గ్రామ అధ్యక్షుడు ఈఫూరి కోటయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. మండల కార్యాలయం కుంచనపల్లి వద్ద మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో.. మండలంలోని పెనుమాకలో మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి, పతాకావిష్కరణ చేశారు.

పేదలకు అండగా నిలిచేందుకే టీడీపీ ఆవిర్భావం



తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పార్టీ శ్రేణులు

తాడికొండ మార్చి 29(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలిచేందుకే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని పార్టీ సీనియర్ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తాడికొండ మండ లంలోని తాడికొండ, కంతేరు, పొన్నెకల్లు, పాములపాడు, రావెల, నిడుముక్కల, మోతడక, గరికపాడు, బండారుపల్లి, దామరపల్లి, తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో గుంటుపల్లి మధుసూదనరావు, దూళిపాళ్ల ఏసుబాబు, నూతక్కి నవీన్‌కుమార్, షేక్ రఫీ, మన్నె రమేష్‌బాబు, సింగు కోటేశ్వరరావు, బండారు శివయ్య, తదితరు లు పాల్గొన్నారు.

తుళ్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తుళ్లూరు గీతా మందిరం సెంటర్లో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు జెండాను ఆవిష్కరించారు. పలువు రు నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లైబ్రరీ సెంటర్లో జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు. మాజీ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య, తెలుగుయువత మండల అధ్యక్షుడు మూల్పూరి నరేష్, నెలకుదిటి చందు పాల్గొన్నారు.

మేడికొండూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలు వేయడంతో పాటు పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. మేడికొండూరులో ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నెశ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పూల నాగమణి, నాయకులు పాములపాటి శివ, సిరిపురంలో సిరిపురం యూనిట్ ఇన్‌చార్జి కడియాల గణేష్‌బాబు, పేరేచర్లలో మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, పి.శ్రీనివాస్, టిడిపి మైనారిటీ నాయకులు షేక్ అబ్దుల్ ఘని, ఎంపీటీసీ సభ్యుడు పాములపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

దుగ్గిరాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాలలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి, రైలుపేటలోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, రాష్ట వాణిజ్య విభాగ ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, పలువురు తెలుగురైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీసెల్ నాయకులు పాల్గొన్నారు.

● చిలువూరులో ఎంపీపీ షేక్ జబీన్, గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతా రామ య్యలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన వారిలో సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజ మరియమ్మ, మాజీ జడ్పీటీసీ జయలక్ష్మి, నిజాముద్దీన్, సాదిక్, జలాలుద్దీన్, శేషగిరిరావు, ఆలపాటి రామారావు, పేరూరి సత్యనారాయణ, ఏసుపాదం పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీసీకార్పొరేషన్ రుణమేళాకు 355 మంది హాజరు

దుగ్గిరాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో బీసీ కార్పొరేషన్ రుణ మేళాను శనివారం నిర్వహించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన రుణమేళాకు 355మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు.